క్లుప్తంగా

ఘనంగా శ్రీరాముని శోభాయాత్ర



పిడుగురాళ్ల : పట్టణంలో శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకుని వానరసేన ఆధ్వర్యంలో బుధవారం శ్రీరామ నవమి శోభ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాముని భక్తులు కాషాయ జెండాలతో ద్విచక్ర వాహనాలపై భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ శోభయాత్ర వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం నుంచి బయలుదేరి ఐలాండ్ సెంటర్ మీదుగా మార్కెట్ యార్డు వద్ద ఆంజనేయస్వామి దేవస్థానం వరకు వెళ్లింది, అక్కడ నుంచి పిల్లుట్ల రోడ్డు లోని సున్నపు బట్టీల వైపు ఉన్న రామతీర్థ ఆశ్రమం వరకు, అక్కడ నుంచి పోలీస్ సెంటర్ మీదుగా తహశీల్దార్ కార్యాలయం సమీపంలోని అభయాంజనేయ స్వామి దేవస్థానం వరకు నిర్వహించారు. అక్కడ నుంచి ఆక్స్‌ఫర్డ్ స్కూల్ వరకు ఈ శోభయాత్ర నిర్వహించి తిరిగి వాసవీ అమ్మవారి దేవస్థానం వరకు చేరుకుని శోభ యాత్రను ముగించారు. శోభయాత్రలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పట్టణ పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. శోభయాత్ర, ర్యాలీ ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, శ్రీరాముని భక్తులు విశేషంగా హాజరయ్యారు.

డాక్టర్ అశోక్‌కుమార్‌కు ఘన సన్మానం



పిడుగురాళ్ల : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన ప్రముఖ వైద్యులు డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్‌ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా ఆహ్వానించి సన్మానించారు. పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు, చింతలపూడి చారిట్రబుల్ ట్రస్టు నిర్వాహకులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరటంతో ఆనందోత్సాహంతో పల్నాడు హాస్పిటల్‌లో డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్‌కు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్‌తోపాటు మార్కెట్ యార్డు డైరెక్టర్ జాషువా, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు జోగిపర్తి ముకంటేశ్వరరావు, ఆటో యూనియన్ నాయకులు వెంకట్ పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

మాచవరం : మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ప్రధాన దేవాలయాల నందు పూజారులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మాచవరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యములో తాటి చలవ పందిళ్లు ఏర్పాటు చేశారు. విచ్చేసిన భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందించారు. కల్యాణం అనంతరం పలు గ్రామాల్లో స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను ఆయా గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు.

బలహీనవర్గాల సంక్షేమమే జగనన్న ధ్యేయం



సత్తెనపల్లి : బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ధ్యేయమని ముదిరాజు కార్పొరేషన్ చైర్మన్ నారాయణ ముదిరాజ్ అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన ముదిరాజుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన నవరత్నాల పథకాల వల్ల బీసీ సామాజిక వర్గాల్లో జరిగిన ఆర్థిక పురోగతిని ప్రతి ఒక్కరికి తెలియచేసి మళ్లీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం రావాలని, తద్వారా బీసీలు లబ్ధి పొందగలరన్నారు. బీసీలను బ్యాక్ బోన్ గా జగన్ మోహన్ రెడ్డి గుర్తించి గౌరవించారన్నారు. ఈ సందర్భంగా నారాయణ ముదిరాజును దుశ్శాలువాతో సత్కరించారు. సమావేశంలో ముదిరాజు సంఘ నాయ కులు కంటు.వెంకట్రామయ్య ,కంటు.సాంబయ్య, నక్క.రమణయ్య, కంటు బ్రహ్మయ్య, పేరు బోయిన శ్రీను, కంటు సుబ్బారావు, ముదిరాజ్ సంఘ నాయ కులు, బీసీ సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. రాములోరి కల్యాణం



రెంటచింతల ఆంజనేయస్వామి మాన్యం కాలనీలో దర్శనమిచ్చిన సీతారాముల వారు



కల్యాణమహోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ పీఆర్కే, రమాదేవి దంపతులు



కల్యాణంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : రాములోరి కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. శ్రీరామనవమి పండుగ సందర్భంగా బుధవారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నారాయణపురంలోని శ్రీ సీతారామ స్వామి దేవాలయంలో ఆలయ పూజారి జగన్మోహనచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మందపాటి రమేష్‌రెడ్డి, బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, వెన్నా హుస్సేన్, గొట్టం అంజిరెడ్డి, కొప్పుల గురవారెడ్డి పర్యవేక్షణలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. స్థానిక టెలిఫోన్ కార్యాలయం వద్ద రామాలయంలో స్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది. వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్ దేవళ్ల రేవతి దంపతులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలు సమర్పించారు. నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కొప్పుల సాంబయ్య, పార్టీ పట్టణ మాజీ కన్వీనర్ మునగా పున్నారావు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో స్థానిక జమ్మిచెట్టు సెంటర్‌లో శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించారు. పండుగ సందర్భంగా పానకం తయారుచేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ పట్టణ కన్వీనర్ షేక్ సుభానీ, బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి దాచేపల్లి సైదారావు, నాయకులు మునగా శ్రీనివాసరావు, మందపాటి దుర్గారావు, యర్రంశెట్టి సైదారావు, జంగాల సింగరయ్య యాదవ్, కొమ్ము బుజ్జి, బొమ్మిరెడ్డి నరసింహరావు, అక్కినపల్లి సత్యం, బొమ్మనబోయిన మహేష్‌యాదవ్, గరికపాటి సైదారావు పాల్గొన్నారు.

వైభవంగా సీతారామ కళ్యాణం

రెంటచింతల : మండలంలోని సత్రశాల పవిత్ర కృష్ణానది తీరాన వేంచేసిన శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానంలోని శ్రీ రామలక్ష్మణ విశ్వామిత్ర ఆలయంలో శ్రీ రామ నవమి సందర్భంగా బుధవారం సీతారామ కళ్యాణ మహోత్సవ వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు చిట్టేల శివశర్మ నేతృత్వంలో స్వస్తిశ్రీ శ్రీ క్రోధి నామసంవత్సరం, నవమి తిథి పురస్కరించుకుని ఉదయం 10 గంటల శుభభముహూర్తంలో పలువురు పుణ్యదంపతులు పీటలపై కూర్చుని ఈ కళ్యాణ మహోత్సవం జరిపించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనే అతి పురాతనమైన శైవక్షేత్రంగా పేరుపొందిన ఈ దేవస్థానంలో తొలిసారిగా సీతా రాముల వారి కళ్యాణం జరిపించడంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు సీతారాములవారి కళ్యాణ వేడుకల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ బద్దూరి బ్రహ్మానందరెడ్డి, ఈవో బుర్రి నెమలిరెడ్డి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కళ్యాణ వేడుకల్లో ఏపి జెన్‌కో నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ఎస్ఈ వెంకట రమణ దంపతులు పాల్గొన్నారు. మండలంలోని పలు రామాలయాల్లో, ఆంజనేయస్వామి ఆలయాల్లో వేసిన చలువ పందిర్ల కింద సీతారామ కళ్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

కనుల పండువగా సీతారామ కళ్యాణ మహోత్సవం

విజయపురి సౌత్ : శ్రీ సీతారామాలయంలో సీతా రామ కళ్యాణ మహోత్సవం బుధవారం కన్నుల పండువగా సాగింది. కళ్యాణ కర్తలుగా స్వామి వారి తరపున తోకల శ్రీనివాసరావు, ధర్మపత్నిచే, అమ్మవారి తరపున ఆడికె దుర్గా వెంకట నాగరాజు కుమార్, ధర్మపత్ని మధులత దంపతులు పీఠల మీద కూర్చుని శ్రీరామ చంద్రమూర్తి, శ్రీ సీతామహాలక్ష్మికి కళ్యాణ కర్తలుగా వ్యవహరించారు. ఆలయ అర్చకులు గుడిపూడి బ్రహ్మాచార్యులు, రఘునాధాచార్యుల ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. కళ్యాణానికి చంద్రమౌళి రామనాధ శర్మ, కోడెల పూర్ణచంద్రరావు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. కళ్యాణం అనంతరం భక్తులకు పానకం, వడపప్పు అందజేశారు. మధ్యాహ్నం భక్తులకు శ్రీ సీతా రామాలయ కమిటీ ఆధ్వర్యంలో 4వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వందలాది మంది కళ్యాణ మహోత్సవంలో పాల్గొనడంతో శ్రీ సీతారామాలయం భక్తులతో నిండిపోయింది. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కోలా వసంతకుమార్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు చిలమకూరి నాగిరెడ్డి, శ్రీ సీతా రామాలయ కమిటీ కార్యదర్శి మన్నేపల్లి రామాంజనేయులు, కమిటీ సభ్యులు జీవీజీ కృష్ణమూర్తి, జి అమర్‌కుమార్ రంగారావు, సత్తిబాబు, ఏఈ నరసింహమూర్తి, ఆదుర్తి నాగరాజు, బాలస్వామి, కృష్ణ జూలూరి, సాయి, ప్రసాద్, శివ పాల్గొన్నారు.

అందరి బంధువు శ్రీరాముడు

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



అన్నదానం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల : శ్రీరాముడు అందరి బంధువు అని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసుమహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని జానపాడు రోడ్డులోని ఏడు కోట్ల సెంటర్‌లో ఏర్పాటు చేసిన శ్రీ సీతాసమేత శ్రీరాముని కల్యాణ మహోత్సవ కార్యక్రమానికి బుధవారం ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సీతారాముల మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీ రాముడు రాజ్యానికి మంచి రాజుగా, తండ్రికి మంచి కుమారుడిగా, తమ్ముళ్లకు మంచి అన్నగా, భార్యకు మంచి భర్తగా, పుత్రులకు మంచి తండ్రిగా నిలిచాడని, నేటి యువత శ్రీరాముని జీవిత గాధను ఆదర్శంగా తీసుకుని మంచిని పాటించి చెడును దూరం చేయాలని సూచించారు. శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి చేతుల మీదుగా నిర్వహించారు. ఆయన వెంట నర్సరావుపేట పార్లమెంట్ పరిశీలకులు రేపాల శ్రీనివాసరావు, డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్, జోగిపర్తి ముక్కంటేశ్వరరావు, శ్రీశైలం అన్నదాన ట్రస్టు డైరెక్టర్ కొడూరి ప్రసాద్, ముడేల వెంకటేశ్వర రెడ్డితోపాటు ఆర్యవైశ్య ప్రముఖులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

కండ్లకుంటలో శ్రీరామనవమి వేడుకలు

వెల్దుర్తి : మండలంలోని వివిధ గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కండ్లకకుంట గ్రామంలో వేంచేసియున్న శ్రీ కోదండ రామాలయంలో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో పండుగలను కలిసికట్టుగా జరుపుకోవటం సంతోషకరమన్నారు. సాంప్రదాయ పండుగలను గ్రామస్థులంతా నిర్వహించుకోవటం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, గ్రామ సర్పంచ్ పిన్నెల్లి వెంకటరెడ్డి, ఎంపీటీసీ ఈడెబోయిన వెంకయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు మోదుగుల వెంకటరెడ్డి, పిన్నెల్లి లక్ష్మారెడ్డి, వెంకట లక్ష్మారెడ్డి, తంగిరాల శివారెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కళ్యాణం

మాచర్ల : పట్టణంలోని రామాలయాలు, కోదండ రామాలయాలు, ఆంజనేయ స్వామి దేవాలయాల్లో శ్రీ సీతారాముల కళ్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి కళ్యాణం సందర్భంగా అలంకరించి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. స్వామి వారి కళ్యాణ మహోత్సవానికి పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, సతీమణి రమాదేవిలు పాల్గొని కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. పూజల్లో సీనియర్ నాయకులు కొమ్మారెడ్డి చలమారెడ్డి, మాజీ సమితి అధ్యక్షులు జూలకంటి పోలిరెడ్డి, శ్రీనివాసశర్మ, మాజీ కౌన్సిలర్ అంకారావు, ఆర్యవైశ్య సంఘ నాయకులు కొత్త మాసు బ్రహ్మారావు, చిల్లంచర్ల ఆంజనేయులు, పిన్నెల్లి హనిమిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ పోలూరి నరసింహారావు, పట్టణ అధ్యక్షులు పోలా శ్రీనివాసరావు, కళ్యాణ పీటల పై విడేల సుందరరావు, కంభంపాటి అమర్ దంపతులు న్నారు.

వైభవోపేతంగా కోదండరాముని కల్యాణమహోత్సవాలు

కారెంపూడి : శ్రీరామ నవమి సందర్భంగా బుధవారం సీతారాముల కల్యాణోత్సవాలు వైభవోపేతంగా జరిగాయి. మిట్టమీద ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలోని శ్రీకోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. స్వామి వారికి ఎదుర్కోలోత్సవం తర్వాత దంపతులు పీటలపై కూర్చుని సీతారాముల కల్యాణోత్సవాన్ని జరిపించారు. ఆలయ అర్చకులు కొమండూరి సత్యనారాయణాచార్యులు వేద మంత్రోచ్ఛారణల మధ్య సీతారాముల కల్యాణం దివ్యంగా కన్నుల పండవగా జరిపించారు. ధర్మకర్త డి వెంకటేష్‌తో పాటు ఎంపీపీ బొమ్మిన సావిత్రిఅల్లయ్య, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కొంగర ఇందిరా సుబ్రమణ్యం దంపతులతో పాటు పలువురు ప్రముఖులు పీటలపై కూర్చుని స్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. నవమి నాడు హనుమాన్ ఛాలీసాను భక్తులు 108 సార్లు పారాయణం చేశారు. కోట సుజాత, సన్నిధి వెంకట జగన్‌మోహన్‌రావు ఉత్సవ ఏర్పాట్లు చూశారు. స్థానిక అంకాలమ్మ గుడి సెంటర్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. అలాగే కాచవరం, చింతపల్లి, మిరియాల, లక్ష్మీపురం, ఒప్పిచర్ల, నరమాలపాడు, పెదకొదమగుండ్ల, చినకొదమగుండ్ల, గాదెవారిపల్లె ఇలా రామాలయం ఉన్న మండలంలోని ప్రతి గ్రామంలో నవమి వేడుకలు వైభవంగా జరిగాయి. పలు చోట్ల వీధుల ప్రధాన కూడళ్లలో మండపాల్లో నవమి వేడుకలు నిర్వహించారు. చలువ పందిరిలో సీతారాముల చిత్రపటాలను ఉంచి కల్యాణోత్సవాలు జరిపించారు.

వాడవాడలా శ్రీరామ నవమి వేడుకలు

పిడుగురాళ్లరూరల్: ఆదర్శవంతమైన శ్రీరాముని నవమి వేడుకలు మండలంలోని వాడవాడలా వైభవంగా నిర్వహించారు. ఆంజనీపురం గ్రామంలో శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో సీతారాముల వారి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. 3 వేల మందికి మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కత్తెరపు అంజిరెడ్డి, గాదె బక్కిరెడ్డి, దొడ్డ ఆంజనేయులరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. బ్రాహ్మణపల్లి గ్రామంలో చెన్నాయిబోడు సెంటర్‌లో శ్రీరామ నవమి వేడుకలను నిర్వహించారు. మండలంలోని కామేపల్లి, కోనంకి, గుత్తికొండ, పందిటివారిపాలెం, జూలకల్లు, తుమ్మల చెరువు, వీరాపురం గ్రామాల్లో శ్రీ రామ నవమి వేడుకలను నిర్వహించారు.



నారాయణపురం రామాలయంలో సీతారాముల కల్యాణం జరుగుతున్న దృశ్యం



సత్రశాల శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి దేవస్థానంలో సీతారామ కళ్యాణం



శ్రీ సీతారామాలయంలో స్వామి వారికి కళ్యాణం



కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఎడ్లబండిపై జగనన్న వీరాభిమాని ప్రచారం



గ్రామ, గ్రామాన ప్రచారం నిర్వహిస్తున్న మండ్లపాటి ఆంజనేయులు

నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రచారం



మండ్లపాటి ఆంజనేయులు

పిడుగురాళ్ల రూరల్ : పార్టీపై..నాయకుడిపై అభిమానంతో ఓటు వేస్తాడు. ఇంట్లో వారితో ఓట్లు వేమని చెబుతాడు. తన బలగంతో ఓట్లు వేయిస్తాడు. ఒక అభిమాని తాను అభిమానించే నాయకుడు, పేదలను ఆదుకునే వ్యక్తి మళ్లీ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలనే దృఢ సంకల్పంతో తన ఎండ్లబండితో గురజాల నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఓ రైతు ప్రచారం చేస్తున్నాడు. గురజాల నియోజకవర్గం మాచవరం మండలం గంగిరెడ్డిపాలెంకు చెందిన మండ్లపాటి ఆంజనేయులు వైఎస్సార్ అభిమాని. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పేదలకు అందించే సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకుపోయి మళ్లీ సీఎంగా జగన్ మోహన్‌రెడ్డిని చేయాలని ప్రచారం చేపట్టాడు. అమ్మ ఒడి, రైతు భరోసా, చేయూత, ఆసరా, విద్య, వైద్యం, సచివాలయం ద్వారా చేస్తున్న సేవలను, రైతులకు అందుతున్న సేవలను, విలేజ్ హెల్త్ క్లినిక్ల ద్వారా పేదలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని, ఆయనకు మన పూర్తి మద్దతు ఇచ్చి మళ్లీ గెలిపించుకోవాలని ఆంజనేయులు కోరుతున్నారు. ఎద్దుల బండి చుట్టూ బ్యానర్లు, బ్యానర్లపైన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, గురజాల శాసన సభ్యులు కాసు మహేష్ రెడ్డి, నర్సరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్ ఫోటోలతో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ముద్రలను బండి చుట్టూ అంటించాడు. మైకులు ఏర్పాటు చేసి దానికి ఎన్నికల అధికారుల అనుమతి తీసుకుని గ్రామాల్లో వాడవాడలా తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ, పార్టీ గెలుపు కోసం కృషి చేస్తున్నాడు.

అభివృద్ధికి చిరునామా మాచర్ల

వ్యవసాయ సలహామండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయిమార్కొండారెడ్డి

రెంటచింతల : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో మాచర్ల నియోజకవర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా మార్చిన ఘనత ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికే దక్కుతుందని జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పశర్లపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాచర్ల నియోజకవర్గ చరిత్రలో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కృషితో కనీవినీ ఎరుగని రీతిలో సుమారు రూ. 1,495 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. రూ. 600 కోట్లతో రెండు హైవేలతో పాటు మాచర్ల, రెంటచింతలకు ఇన్నర్ రింగ్ రోడ్లు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. నియోజకవర్గంలో రూ. 30 కోట్ల వ్యయంతో 45 సచివాలయాలు, 46 రైతు భరోసా కేంద్రాలు, 15 వైఎస్సార్ పాలవెల్లువ కేంద్రాలు నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. చిన్న, సన్న కారు రైతులకు సాగునీరు అందించేందుకు వైఎస్సార్ జలకళ పథకం కింద రూ.80 కోట్లతో బోర్లు వేయించి ఆదుకోవడం జరిగిందన్నారు. గ్రామాల్లో రూ.150 కోట్లతో గడపగడప ద్వారా మంజూరైన మరో రూ. 7 కోట్లతో సీసీ రోడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బుగ్గవాగు లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ.170 కోట్లు, వరికపూడిశెల లిఫ్టిరిగేషన్‌కు రూ.340 కోట్లు, వివిధ సామాజిక వర్గాలకు కమ్యూనిటీ హాల్స్ ఏర్పాటు, ఇళ్ల స్థలాల పంపిణీకి ప్రభుత్వం రూ. 150 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీపీ పి. సంపూర్ణమ్మ, మండల పార్టీ అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, జేసీఎస్ చైర్మన్ మోర్తల ఉమ, మాజీ మున్సిపల్ చైర్మన్ బత్తుల ఏడుకొండలు, జిల్లా కార్యదర్శి చల్లా మట్టారెడ్డి, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు వడితే బుడ సైదానాయక్ తదితరులున్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలి



వెల్దుర్తి : ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని పల్నాడు జిల్లా ఎస్పీ బిందు మాధవ్ అన్నారు. మండలంలోని గొట్టిపాళ్ళ గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ఎలాంటి అలజడులు లేకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఆధిపత్యం కోసం గ్రామాల్లో ఎలక్షన్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వారి పై కఠిన చర్యలు తప్పవన్నారు. గ్రామంలో ఎవరైనా దౌర్జన్యాలకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. మాచర్ల నియోజకవర్గంలో, వెల్దుర్తి మండలం సమస్యాత్మకమైనదని గుర్తించామన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో తిరిగి ప్రజలకు ఓటు హక్కు పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. మండలంలోని గుండ్లపాడు, కండ్లకుంట, కొత్తపుల్లారెడ్డిగూడెం, గొట్టిపాళ్ళ గ్రామాలలోని పోలింగ్ బూత్‌లను పరిశీలించామన్నారు. గురజాల డీఎస్పీ పల్లపురాజు, రూరల్ సీఐ కె సురేష్, ఎస్ఐ వి శ్రీహరి, తహశీల్దార్ చంద్రశేఖర్, డిటీ రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లపాటి గురుబ్రహ్మం, వెంకట నారాయణ, రామాంజనేయులు, మారబోయిన అచ్చయ్య, టీడీపి నాయకులు రాజబోయిన మధుసూదన యాదవ్, ప్రసాద్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ కుటుంబాలు చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల : పట్టణంలోని పలు వార్డుల నుంచి టీడీపీకి చెందిన పలువురు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 6 వ వార్డు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఇల్లూరి వెంకయ్య ఎమ్మెల్యే కాసు మహేషరెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ప్రసాదం రాజు, ప్రసాదం నాగరాజు, పొగర్తి శంకర్, పొగర్తి వెంకటేశ్వర్లు, ప్రసాదం మణికంఠ, ప్రసాదం నందకుమార్, ప్రసాదం సునిల్‌కుమార్, కామాంధుల మంగమ్మ, పొగర్తి బుజ్జి, అంకమ్మ, బుల్లి అమ్మాయి, పలు కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.

బీసీల అభివృద్ధికి పాటుపడుతున్న సీఎం జగన్

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారితో పీఆర్కే

వెల్దుర్తి : బీసీల అభివృద్ధి కోసం సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాటుపడుతున్నారని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బీసీ కుటుంబాల కోసం పలు పథకాలు ప్రవేశపెట్టి వారి పట్ల ఎంతో అభిమానంతో ఉన్నారన్నారు. మండలంలోని రామచంద్రాపురం తండా గ్రామ నాయకులు సబ్బసాని కోటిరెడ్డి, మండల పరిషత్ అధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి, గోళ్ళ యర్రబ్బాయిల ఆధ్వర్యంలో మరికొందరు టీడీపికి చెందిన మూడావత్ లఘుపతి నాయక్, చిరంజీవి నాయక్, లక్ష్మా నాయక్, శివానాయక్, తులిస్యానాయక్, శ్రీనివాసరావు నాయక్, రాజు నాయక్, సురేష్‌నాయక్, కర్పూరపు నాయక్, బాద్యానాయక్‌లు టీడిపిని వీడి వైఎస్సార్‌సీపీలో బుధవారం చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు బాణావత్ శ్రీను నాయక్, సర్ధార్ నాయక్, మంత్రూ నాయక్, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పిన్నెల్లి వెంకటరెడ్డి, మోదుగుల వెంకటరెడ్డి, రవీంద్రనాయక్, మేడబోయిన కష్ణ, కంపసాటి కాటంరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

- నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి
- నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ. శ్యాం ప్రసాద్



నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ. శ్యాం ప్రసాద్

మాచర్ల రూరల్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల షెడ్యూలు ప్రకారం ఈ నెల 18 నుంచి నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ప్రారంభమవుతున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్, నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్యాం ప్రసాద్ తెలిపారు. ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచే నామినేషన్ల స్వీకరణ జరుగుతుందని చెప్పారు. 18 నుంచి 26వ తేదీ వరకు స్వీకరణ, 29న ఉపసంహరణ జరుగుతుందని, నామినేషన్లు అందజేసే సమయంలో అభ్యర్థులు 13 రకాల డాక్యుమెంట్లను తీసుకురావాలని, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు స్వీకరించటం జరుగుతుందన్నారు. సెలవు రోజుల్లో నామినేషన్లను స్వీకరించరని, అభ్యర్థులు నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చని పేర్కొన్నారు. నామినేషన్ దాఖలు నుంచి అభ్యర్థి ఖర్చు ఖాతాలో లెక్కించబడుతుందన్నారు. రూ. 40లక్షల పరిమితి ఖర్చు ఉంటుందన్నారు.